స్కెచ్

# మొదటితేదీ సాయంత్రం

దుద్దుకూరు కృష్ణారావు

మొదటి తేదీ. సాయంత్రము ఇంటికి వచ్చే టప్పుడు జీతం మొత్తం తీసుకురమ్మని మా శ్రీమతి ఆదేశించింది 'సరే'నని బయల్దేరాను. అప్పటికే పది దాటింది. త్వరగా వెళ్లక పోతే అధికారితో మాటలు పడాల్సి వస్తుందని ముందు నడక సాగించాను.

సందు మలుపు తిరగగానే తమలపాకులు వేసుకోలేదన్న సంగతి గుర్తుకొచ్చింది దుకాణంలో తీసుకుందామంటే జేబు ఖాళీ. షేర్వానీ జేబులు తడిమి చూచుకున్నాను - ఏమన్నా దొరుకుతుందేమోనని నాల్గవ తేదీకే ఖాళీ అయ్యే జేబుల్లో నెలాఖరులో డబ్బు లేముందేడుస్తాయి నా పిచ్చిగాని.

గమనం త్వరితంచేసి జన సమర్దంలో నుంచి ముందుకు పోసాగాను. ఈ నెలజీతంలో తీర్చవలసిన బాకీలు మనసును వేధిస్తున్నాయి. ఆలోచనలతో బుఱ్ఱ వేడెక్కింది. ఖర్చులు చూస్తే జీతానికి మించి ఉన్నాయి పొలము మీదనుంచి వస్తుందనుకొన్న సొమ్ము చేతికి అందలేదు. ఇవాళ, రేపు అంటూ రైతులు త్రిప్పుతున్నారు. వాళ్లు చెప్పినట్లు నేను కూడా ఇచ్చేవాళ్లకి చెప్పుకుపోతున్నాను. ఆఫీసు జేరుకునేటప్పటికి దీని దుంపతెగ పదినిమిషాలు ఆలస్యమవనే అయింది. దయా దాక్షిణ్యం లేకుండా ఎఱ్ఱమార్కు పడేసాడు సూపర్నెంటు దానిమీదనే సంతకం పెట్టి సెక్షన్లోకి వెళ్లాను

రామం, వెంకట్రావు, చలపతి బల్లదగ్గిర జేరి కేరింతాలు కొడుతున్నారు నన్ను చూడగానే 'రావోయి సాయిబూ' అంటూ చలపతి పిలిచాడు షేర్వానీలు మా సెక్షన్లో నేను తప్ప ఇంకెవరు వేసుకోరు కాబట్టి 'సాయిబూ' అని వాళ్లు పిలువడం పరిపాటయింది చేతిలోని పత్రికలు బల్లమీదపెట్టి వాళ్లలో జేరాను

'మంజూ ప్రోగ్రాం వేశాం' అన్నాడు చలపతి. బ్రహ్మచారి, ఎవరూ తనమీద ఆధారం లేరుగాబట్టి 'మంజూ' కాదు, 'రెట్జ్'కే వేసేవాడేమో ప్రోగ్రాం! వీడితో రామం, వెంకట్రావులు ఎలా జేరారా అని ఆలోచనలో పడ్డాను. వారిద్దరికీ నాకన్నా సంతతి ఎక్కువే, జీతం కూడా చాలా తక్కువ! అర్థంలేని ఆలోచనలు కలవర పడ్డ మనస్సును మరింత కలవరపరిచాయి. 'మన బడ్జెటులో లోటు ఎక్కువగా వుంది' అని ముక్తసరిగా జవాబు ఇచ్చాను. 'మాకు లేదా? మే మెట్లా ఒప్పుకున్నాం?' అని వెంకట్రావు అన్నాడు జవాబు చెప్పదా మనుకున్నాను. కాని అనవసరమని ఊరుకున్నాను. కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది. కాబట్టి వాళ్ల లోపాలను ఎంచడం మంచిది కాదనే ఉద్దేశంతో 'ఈ సారికి క్షమించరా' అన్నాను చలపతితో. వాళ్ళకు అర్థమయింది. అంతే ఎవరి పనిలో వాళ్లు మునిగిపోయారు

* * *

నాలుగున్నర దాటింది. అందరూ అందుకున్నారు జీతాలు, నేనుకూడా. ఒక పచ్చ కాగితాన్ని ఆరు పది నోట్లను జేబులో క్రుక్కాను. సెక్షన్ అప్పుడే ఖాళీ అయింది. ఆందోళన వున్నా లేనట్లు నటించేవాళ్లు వారు. నటన చేత కానప్పుడు ఏం చేయాలి. ప్యూన్‌కు రూపాయి చేతిలోపెట్టి బయటపడ్డాను.

రెండడుగులు వేసానో లేదో డాక్టరుగారి జవాను తయారయ్యాడు. బిల్లు తీసుకుని పైకం చెల్లించాను. రెండు నోట్లు, వాటిభారం తగ్గాయి. రిక్షావాడుకూడా రిక్షాను తీసుకు వచ్చాడు కూర్చున్నాను ఇంటికేమోనని ఆ దారి పట్టాడు. అక్కడకు కాదని పేట్లాబుర్జ వైపు తీసుకుపోమన్నాను.

ఎత్తు ఎక్కలేక కష్టపడుతూ నడుపు తున్నాడు రిక్షాను. వాడిని చూస్తుంటే జాలి వేసింది పాడు పొట్టకోసం కదా కష్టం! కాని కష్టాలలో కూడా మనుష్యులవలె ఎంత తార తమ్యం వుందీ! గమ్యస్థానం వచ్చింది. వాడి కివ్వవలసిన ఒక నోటు ఇచ్చి పొమ్మన్నాను. సంతోషంతో, అశ్రుపూరిత నయనాలతో "నమస్తే దొరా?" అని వెళ్ళిపోయాడు.

నాకోసమే వేచివున్నట్లు ముఖం పెట్టుకొని కూర్చున్నాడు రామయ్య. "రండి, రండి, పంతులుగారూ!" అంటూ కుర్చీ చూపెట్టాడు ఆరునోట్లు తీసి ఇచ్చాను. లెఖ్ఖకట్టి రూపా యిన్నర వాపసు చేసాడు. వాడికిచ్చిన సంచి తీసుకుని బయల్దేరాను. అన్నీ ఉన్నాయో లేదో కూడా చూడడానికి ప్రయత్నించ మన సొప్పలేదు. అందులోనూ స్నేహితం ఇప్పటిది కాదు!

కొంచెం దూరం నడిచాను జేబులోని పైకాన్ని లెఖ్ఖపెడదామనుకున్నాను. లెక్క పెట్టి ఏం లాభం? మనదగ్గఅ ఉంటుందనా? ఆత్మమటుకు ఘోషిస్తున్నది లెఖ్ఖించమని ఆత్మకు జీవితంలో నేనెప్పడూ ప్రాధాన్యం ఇవ్వ లేదు దాని ఘోష నాకెందుకు?

ఆబిద్ రోడ్డుకు వచ్చేటప్పటికి సూర్యభగ వానుడు పని పూర్తి చేసుకొని వెళ్ళిపోయాడు ఆ నల్లని మచ్చ, గుండ్రటి ముఖంతో చంద్రుడు భీకరంగా ఉన్నాడు. వీడే ఒకప్పుడు నన్ను ఆనందసాగరంలో ముంచాడు ఇప్పుడు నన్ను చూస్తుంటే నవ్వుతున్నాడు నవ్వకేం చేస్తాడు? పూర్తి మొత్తం తీసుకరమ్మని చెప్పింది ఇంటి నుంచి బయల్దేరేటప్పుడు, కాని సగానికిపైగా జేబు ఖాళీ అయింది. ఇంటిలోని తిరుగు బాటును దృష్టిలో ఉంచుకొని నవ్వుతున్నాడని నాకేం తెల్సు?

ఏమయితే అయిందని "టాయ్ ఎంపోరి యమ్"లో జొరబడ్డాను అన్నీ కావాలనే ఉంది! కాని....జేబులోని సొమ్ము అప్పటికే చాలా మటుకు కరిగిపోయింది....ఏంచేయాలి? అమ్మాయి రోజూ అదోలా ముఖంపెట్టి 'తీసుకు రాలేదా' అని అడుగుతూ ఉంది. దాని ముద్దు ముచ్చట్లు తీర్చలేకపోతే ఎలా? పరాయిసొత్తు గదా....మనదగ్గర ఎన్నిరోజు లుంటుంది.... ధైర్యం చేసాను. 'గుఱ్ఱం'. అందమైన గుఱ్ఱాన్ని కొన్నాను. జీవితంలో ప్రథమ పర్యాయం మా అమ్మాయి ముద్దు తీర్చగలిగాను. ఆ గుఱ్ఱాన్ని చూస్తుంటే నాకే చాలా సంతోషంగా ఉంది మా అమ్మాయి సంగతి ఆలోచించుకుంటూ వెలుపలికి వచ్చాను. ఇద్దరు ముగ్గురు రిక్షావాళ్లు పోటీ పడుతున్నారు. బేరం చేయకుండానే ఎక్కాను ఒకడిదాంట్లో.

రిక్షా త్రొక్కకు పోతున్నాడు. ఎత్తుప్రదేశం వచ్చినప్పుడల్లా దిగుతున్నాడు, లాగుతున్నాడు వాడ్ని చూస్తుంటే చాలా జాలి కలిగింది. రూపాయి చేతిలో పెడదామనుకున్నాను పోనీలే, వాడి పెళ్లాం బిడ్డలన్నా రెండురోజులు నన్ను జ్ఞాపకం చేసుకుంటారనే సంతృప్తి నాలో కలిగింది. వద్దంటున్న ఆత్మకు ఆ సమాధానమే చెప్పాను

జేబు తడుముకుంటే ముచ్చటగా మూడు నోట్లు తగిలాయి. అరెరే....అప్పుడే అన్ని అయిపోయాయా? ఇంకా చాలామంది మిగిలి పోయారే....ఇంటద్దె, పాలవాడు, కూరల మనిషి, చాకలి....అందరూ కళ్ళముందర ప్రత్యక్షమయ్యారు వాళ్లు నావేపు తీక్షణంగా చూస్తున్నారు. నదురు బెదురు లేకుండా నేను కూడా వాళ్ళను చూస్తున్నాను. రెండురోజు లాగమంటున్నాను. ఇప్పుడే కావాలంటున్నారు అందరూ....

'ఎక్కడికి వెళ్ళాలి దొరా' ఆలోచనలకు అంతరాయం కలిగింది. అవును....నిజమే.... ఎక్కడకు వెళ్ళాలో వాడికి చెప్పలేదు....ఎదు రుగా చూస్తునుకదా...కందస్వామి మార్కెట్టు దిగిపోయి వాడిచేతిలో రూపాయి పెట్టాను.

బనార్సీ మిరాయి ఘర్‌లోని మిరాయి దొంతర్లు అందంగా కనపడ్డాయి. కొనొద్దనుకుం టూనే కొనేశాను.

మా రాణీగారికి సోన్‌పట్టీ చాలాయిష్టం. అది తీసుకువస్తే ఇంట్లో 'తిరుగుబాటు' ఉండదేమో! అనుకుంటూనే అదికూడా కొన్నాను. తాళికట్టిన నాడు తన బంధువుల నందరిని విడిచి నా

వెంట భవిష్యత్తును గడపడానికి సంతోషంతోనూ, ఆనందంతోనూ వచ్చిన అమాయక హృదయానికి ఇదేనా చేయవలసింది?

ఆత్మ ఘర్షణ ఆరంభమయింది. కాళ్లు కదలడంలేదు..... చేతిలో సామాన్లు .... అలాగే నడచుకుంటూ ఇంట్లో జరుగబోయే తిరుగుబాటు సూహిస్తూ జేరాను.

తలుపు తెరచి చిరునవ్వుతో ఆహ్వానించింది శ్రీమతి. సామాన్లు అందుకుంది. కాఫీ అందించింది.

''డ్రెస్ మార్చకండీ .ఎగ్జిబిషన్‌కి వెళ్దాం'' అంది. నేనేం మాట్లాడలేదు.

పెండ్లిలో నేను పెట్టిన మైసూరు పట్టుచీర రవికను సింగారించుకుంది ఆ రోజు పెండ్లయి నప్పటి రోజులు జ్ఞాపకం వచ్చాయి. దగ్గరకు లాగుకున్నాను.

రెండు పచ్చనోట్లు చేతిలో పెట్టింది, "పంట బాపతు'' అంటూ.

పట్టరాని ఆనందంతో ఆమెను కౌగిట్లోకి లాక్కున్నాను. "అబ్బ అమ్మాయి వస్తూన్నదుండండీ" అంటూ విడిపించుకుంది.

"పదండి నాన్నారూ-ఎగ్జిబిషనుకు" అంటూ అమ్మాయి వచ్చింది.

ప్రొద్దుటినుంచీ పడిన ఆందోళనంతా క్షణంలో మాయమైందికదా అనుకుంటూ ఎగ్జిబిషనుకు బయలుదేరాను. ★

# నగరంలో ప్రమాదం ★ "గోపాల చక్రవర్తి"

అభాగ్యుడు శ్రామికుడొకడు
మరణించాడు నిన్న సాయంకాలం
కారుక్రింద పడి నలిగింది కళేబరం
విశ్వనాథ చెప్పింది నిజం
ఆగలేదు సుమా రథం
కర్మబాబూ పూర్వజన్మ దుష్కృతం
కూలిపోయింది పాంచభౌతిక భవనం
వగచాడొక శుష్కవేదాంతి
ఒళ్లు పొగరేం కళ్లు లేవూ
అహంకారంతో హుంకరించి
ముందుకు నడచాడు తాలింఖానా మనిషి
ఇది ఈ మానవుని తుదినిశ్వాసం కాదు
అడుగుమెట్టు అనాథలందరిదీ
పలికాడు మానవవాది
అమోఘ దయానిధి.
నా జీవిత ప్రాంగణాన
కురిపించాడు ముత్యాలవాన
అతనిమాట వెన్నెలమూట
అందాల జోలపాట
రక్తం పొంగిన చెక్కిళ్ళతో
అనంతమైన గుండెల ఘోషతో
ఉద్రేకంతో ఉన్మాదంతో
విలపించింది అభాగ్యుని రాణి
అమాయక తరుణి
సాధారణ వనిత
''ఎ వుమన్ ఆఫ్ నో ఇంపార్టెన్స్''
నీ వెనుక మేమంతా వున్నాం
ఇదిగో చెల్లెలా నీ వాళ్లం
నువ్వు చేయని తప్పులకు
నీకు విధించాడు శిక్ష శివుడు
అన్నలార పిన్నలార
బారులుదీర్చి నిలబడండి
అభాగ్యుని అంతిమఘట్టమైన
అద్భుతంగా జరగాలి
అన్నాడు దయానిధి మానవవాది
రాత్రి చేరారు శ్మశానం
వేలకొలది జనం
ఆకాశకన్య కన్నులు తెరిచి
ఆశ్చర్యంతో చూసిన ఘట్టం
దూరతీరాల్లో వున్న ఆత్మ
ఆనందంతో కెవ్వుమని కేకవేసింది
నగ్న ఆకాశం నాడులన్నీ
త్రెంచుకుని నాట్యం చేసింది.
అభాగ్యుడు శ్రామికుడొకడు
మరణించాడు నిన్న సాయంకాలం. ★